## క్లుప్తంగా

### ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీఓ శైలజ



ఎమ్మెల్యే సబితారెడ్డితో ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరం ఎంపీడీఓ శైలజ శనివారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీడీఓ తెలిపారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయాలనది ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

చైర్మన్ మధుమోహన్

తుక్కుగూడ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మధుమోహన్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో అభివృద్ధి కోసం రూ.3 కోట్ల 18 లక్షలు కేటాయించామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రెడ్ మిక్స్ ప్లాంట్లను తొలగించేందుకు జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపాలని తీర్మానం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, ఏఈ భార్గవ్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు శివకుమార్, మౌనిక, పద్మ, తేజస్విని, విలాస్, హేమలత, రవినాయక్, సుమన్, భావన, రాజు, మేనేజర్ వెంకటేష్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పెద్దమ్మతల్లికి బోనాలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి పెద్దమ్మ తల్లి బోనాలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్త కమిటీ సభ్యులు ఈరంకి విశ్వనాథ్ గౌడ్, లిక్కి విజయేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, ఆదిల్ల సిద్ధు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ అమ్మవారి ఆలయాన్ని సీఐఎస్ఎఫ్ అధికారులు తొలగించేందుకు ప్రయత్నించడం తగదని వారు మండి పడ్డారు. ఆలయం జోలికొస్తే ఊరుకోమని వారు హెచ్చరించారు.

### సతీశ్ నాయర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అయ్యప్ప భక్తులు

మహేశ్వరం: మన్సాన్‌పల్లి గ్రామంలో అయ్యప్ప గురుస్వామి సతీశ్ నాయర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. గురు స్వామి సతీశ్ నాయర్‌ను ఆదర్శంగా తీసుకొని ఎంతో మంది భక్తులు అయ్యప్ప మాలలు ధరించారని అయ్యప్ప భక్తులు పేర్కొన్నారు. ఆయన మరణం అయ్యప్ప భక్తులకు తీరనిలోటని వారు పేర్కొన్నారు. అంజయ్య, పబ్బ రాఘవేందర్ గౌడ్, పబ్బ ఆంజనేయులు గౌడ్, మంత్రి రాజేశ్, రాఘవేందర్ గౌడ్, దేవరం గౌడ్ పలువురు పాల్గొన్నారు.

### ఏసీపీ ఉమామహేశ్వర్ రావు బాధ్యతల స్వీకరణ

మహేశ్వరం: మహేశ్వరం జోన్ ఏసీపీగా ఉమామహేశ్వర్‌రావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహేశ్వరం, కందుకూరు, పహాడిషరీఫ్, బాలాపూర్ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం జోన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. సీఐ, ఎస్‌ఐలను సమన్వయం చేసుకుంటూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ విధానంతో పని చేస్తామన్నారు. మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణలను నూతన ఏసీపీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు, పహాడిషరీఫ్, బాలాపూర్ సీఐలు వెంకటేశ్వర్లు, మక్బుల్‌జానీ, గురువారెడ్డి, వెంకట్‌రెడ్డిలతో పాటు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# కుక్కలున్నాయి.. జాగ్రత్త

తుక్కుగూడలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా దాడి చేసి పిక్కలు పీకేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్య పహారా కాస్తూ ఎవరు దొరుకుతారా అని ఎదురు చూస్తుంటాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. పుర వాసులకు దడపుట్టిస్తున్నాయి గ్రామ సింహాలు.

**బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు**

- గుంపులుగా రోడ్లపై సంచారం
- బాటసారులను పరుగులు పెట్టిస్తున్న వైనం
- వాహనదారులను వెంబడిస్తున్న శునకాలు



రావిర్యాలలో వీధి కుక్కల సంచారం

తుక్కుగూడ: మున్సిపాలిటీలో వీధి కుక్కలు చేలరేగిపోతున్నాయి. వీధులు, రోడ్లపై గుంపులుగా సైర్య విహారం చేస్తూ ప్రజలను హడలెత్తున్నాయి. రావిర్యాల, మంఖాల్, సర్దార్‌నగర్, దేవేందర్‌నగర్ కాలనీ, ఇమామ్‌గూడ ఇలా ఏ గ్రామంలో చూసినా... శునకాల బెడద పెరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈ-సిటీ, మంఖాల్ పారిశ్రామికవాడ, హార్డ్‌వేర్ పార్కు తదితర పరిశ్రమలతో పాటు వండర్‌లా పర్యటక కేంద్రం ఉండటంతో ఇక్కడ అనేక మంది ఉపాధి పొందుతున్నారు. దీంతో ఇక్కడ విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్తున్న ద్విచక్ర వాహనాలదారులను శునకాలు వెంటాడుతున్నాయి. భయంతో వాహనాలు అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. పాదచారులపై కూడా దాడులు పెరగడంతో స్థానికులు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

**మూగజీవాలపై దాడులు**

మున్సిపాలిటీ పరిధిలో పలు గ్రామాల్లో మూగజీవాలపై శునకాలు దాడులు చేస్తున్నాయి. గత నెలలో రావిర్యాలలో ఓ రైతుకు చెందిన మేకల మందపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాయి.

# రాజరాజేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్‌గా అల్లె కుమార్

మహేశ్వరం: మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్‌గా మహేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లె కుమార్‌ను నియమిచినట్లు శనివారం ఆలయ దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారి మురళీ కృష్ణ పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులుగా ఎం రాకేశ్, ఏ రాకేశ్, ఎస్ కన్నయ్య, కె జగన్, ఎ సాయిలు, కె శ్రీశైలం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆలయ చైర్మన్ అల్లె కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రంలో ఒకటైన మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి చైర్మన్‌గా ఎంపికవ్వడం గర్వంగా ఉందన్నారు. ఆలయ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

కడ్తాల్: మండల పరిధిలోని కొండ్రిగాన్‌బోడ్‌తండాతో పాటు, పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డి చెరువుతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం కొండ్రిగాన్‌బోడ్‌తండాతో పాటు, పెద్దారెడ్డి చెరువుతండాలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు అధికారులు, నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని వారు కోరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ప్రత్యేధికారి శ్రీనివాస్, కార్యదర్శి లింగారెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వక్కలంక శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేసినందుకు పార్టీ తనకు పదవీ బాధ్యతలు అప్పగించి గౌరవించిందన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా తాను పని చేస్తానని తెలిపారు. తనకు పార్టీ పదవీ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు మధుయాష్కీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌రావు

# లక్ష్య సాధనకు నిరంతరం కష్టపడాలి

వనస్థలిపురం: హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో-2024 అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ స్పెషల్ ప్రాజెక్ట్, డీఆర్‌డీఓ డాక్టర్ శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ, అత్యంత పేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని, మిస్సైల్ మేన్‌గా ఎదిగి, దేశానికి రాష్ట్రపతి అయిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మనందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని దానిని చేరుకోవడానికి నిరంతరం కష్టపడాలన్నారు. తమ పరిశోధనల ద్వారా మానవాళి అభివృద్ధికి పాటుపడాలని, దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఎస్‌వీ సత్యనారాయణ, మెంబర్ ఆఫ్ ఎస్ఎల్‌పీఎస్ పి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేషన్ జోనల్ ఇన్‌చార్జి కిషోర్, జోనల్ డీన్ జ్యోతి, ఇన్‌చార్జి దయాకర్, ప్రిన్సిపాళ్లు సూర్యనారాయణ, సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న డాక్టర్ శ్రీనివాసశాస్త్రి

# జాతర ఏర్పాట్లు పూర్తి చేయండి

చైతన్యపురి: ఫణిగిరి కాలనీలోని పురాతన శివాలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అధికారులను కోరారు. శనివారం మూసీ నదిలోని శివాలయాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నదిలోని శివాలయం వరకు భక్తులు వెళ్లేందుకు వీలుగా మెట్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, తాగు నీరు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. జాతర ఏర్పాట్లు 20 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ ఇన్‌స్పెక్టర్ రత్నసాయి, రాంకీ ఇన్‌చార్జి రవి, జీహెచ్ఎంసీ జవాన్ గణేష్‌రెడ్డి, జాతర నిర్వాహకులు కృష్ణారెడ్డి, ప్రభు, రాకేష్, స్థానికులు కమల్‌జీ, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



శివాలయం పరిసరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, అధికారులు

# ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

వనస్థలిపురం: తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురంలోని సంపూర్ణ థియేటర్‌లో నూతన సంవత్సర కేలండర్‌ను విడుదల చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారావు, సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్యలు కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సినిమా థియేటర్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంతో పాటు థియేటర్ల యాజమాన్యాలను కోరారు. కార్యక్రమంలో సంపూర్ణ థియేటర్ మేనేజర్ గోపాల్, సిబ్బంది వెంకటేష్, మహేష్, రాజు, యూసుఫ్, రవి, ఈశ్వర్, భాను, జంగయ్య, బహదూర్, శంకర్, శ్రీకాంత్, మురళి, ప్రకాష్ పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

# ఘనంగా 'బచ్‌పన్' వార్షికోత్సవం

లింగోజిగూడ: కొత్తపేట డివిజన్ పరిధిలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రతిభ కనరిచిన విద్యార్థులకు బచ్‌పన్ పాఠశాల తెలుగు రాష్ట్రాల రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రూపారెడ్డి , కౌషిరెడ్డి, జితేంద్ర దేవి తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి యోగా ఉచిత శిక్షణ

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌లోని భవానీనగర్ మహిళా మండలి భవనంలో ఆదివారం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో సిద్ధి సమాధి యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న యోగా గురువు సద్గుణాచారి తెలిపారు. దీర్ఘకాలంగా పీడించే ఆస్తమా, అల్సర్లు, డయాబెటిక్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం, ఊబకాయం, ఎలర్జీల నుంచి విముక్తి కలిగించే సాధనం సిద్ధ సమాధి యోగా అన్నారు.శిక్షణ తరగతుల్లో ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, సమాధి, మెడిటేషన్, ఆహారపు అలవాట్లను నేర్పబడతామన్నారు. మరిన్ని వివరాలకు 93933 57033 సెల్‌నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

లింగోజిగూడ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ ఫేజ్-2 కాలనీలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో కార్పొరేటర్ పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు ఎప్పటికప్పుడు బస్తీల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శివ, స్వామి, మల్లేష్, జంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా చరణ్, ఆర్‌జేడీగా శ్రావణి, డీఈవోగా అక్షయ, ఎంఈవోగా శివ వ్యవహరించగా, మరో 16 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తమ తోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు కిశోర్ తదితరులు ఉన్నారు.

**ముద్వీన్ పాఠశాలలో**

ముద్వీన్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంగా భార్గవ్, విద్యాశాఖ మంత్రిగా శివకుమార్, కలెక్టర్‌గా శైలజ, ఆర్‌జేడీగా శ్రీజ, డీఈఓగా కావేరి, డిప్యూటీ ఈఓగా ప్రణతితో పాటు 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయుడు భీముడు తదితరులు ఉన్నారు.

**ఆమనగల్లులో**

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని రిషి టాలెంట్ హైస్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్వపరిపాలన దినోత్సవంలో ఆర్‌జేడీగా నాగమణి, డీఈఓగా హన్సిక, ఎంఈఓగా అభిజ్ఞ, కరస్పాండెంట్‌గా ఆకాశ్, ప్రిన్సిపాల్‌గా సంపత్‌కుమార్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ బహుమతులు ప్రధానం చేశారు.

# అట్టహాసంగా బండలాగుడు పోటీలు



చుక్కాపూర్‌లో బండలాగుడు పోటీలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయ ప్రాంగణంలో అట్టహాసంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. తొమ్మిది జతల కాడీలు వచ్చాయి. ఎస్‌ఐ శ్రీకాంత్ పందెం గుండు (బండలాగుడు) పోటీలను ప్రారంభించారు. కడారి పెద్ద జంగయ్య ఎద్దులు రూ. 15,000 ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. బైకని రాములు ఎద్దుల జత రూ. 10,000 ద్వితీయ బహుమతి, గోసుల కృష్ణయ్య ఎద్దుల జత రూ. 5,000 తృతీయ బహుమతిని అందుకున్నారు. వంగూరి మహేశ్ సహకారంతో రైతులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరశర్మ, ఎంపీటీసీ వందన, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణమ్మ పాల్గొన్నారు.

# ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ రాష్ట్ర స్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతిగా రూ.10,116, మూడవ బహుమతిగా రూ.5,116 అందించారు. టోర్నమెంట్‌లో పాఠశాల స్థాయిలో బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ ఆకుతోటపల్లి, జెడ్పీహెచ్ఎస్ కడ్తాల, జెడ్పీహెచ్ఎస్ నాదర్‌గుల్, బాలికల విభాగంలో బాలనగర్ గురుకుల పాఠశాల, కల్వకుర్తి గురుకుల పాఠశాల, ఆమనగల్లు వివేక విద్యాభారతి పాఠశాలలు బహుమతులు గెలుచుకున్నాయి. పురుషుల విభాగంలో విన్నర్‌గా శెట్టిపల్లి సత్యం టీమ్, రన్నర్‌గా చరికొండ టీం, మూడవ బహుమతి దేవునిపడకల్ టీమ్‌లు గెలుచుకున్నాయి. మహిళల విభాగంలో జీహెచ్ఎంసీ ఆధ్యానగర్ టీమ్, రన్నర్‌గా నల్గొండ టీమ్, మూడవ బహుమతి కల్వకుర్తి టీమ్‌లు గెలుచుకున్నాయి విజేతలైన టీంలకు జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎగిరిశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవి నగదు బహుమతి, షీల్డ్‌లను అందించారు. ముగింపు కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



విజేతకు షీల్డు అందిస్తున్న సత్యం



కందుకూరు: కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తుక్కుగూడ: జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ఘనంగా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు

మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రాజకీయనాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యాలయాల్లో శనివారం కేక్‌కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయన నిండు నూరేళ్ల పాటు జీవించాలని పలువురు ఆకాంక్షించారు.



మహేశ్వరంలో బీఆర్ఎస్ నాయకులు